సాక్షి
రంగారెడ్డి

శనివారం । 9 । నవంబర్ । 2024



క్రీడలకు అధిక ప్రాధాన్యత

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. 8లో▸



పునరాలోచన చేయాలి

ఫార్మాసిటీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కోరారు. 8లో▸



పింఛన్ల కోసం పోరాటం

ఆసరా పింఛన్లు పెంచే వరకు పోరాడుతూనే ఉందామని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

దైవనామస్మరణతో మంచి ఆలోచనలు

త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి



మరకత పంచముఖ హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న చినజీయర్ స్వామి

శంకర్‌పల్లి: దైవనామస్మరణతో రాతలు మారుతాయని, మంచి ఆలోచనలు వస్తాయని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సింగాపురంలో ఐదురోజుల పాటు నిర్వహిస్తున్న మరకత కార్యసిద్ధి పంచముఖ హనుమాన్ ప్రతిష్ఠాపనోత్సవాలకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగాపురంవాసులు ఆయనకి పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించే మరకత పంచముఖ హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని, యాగశాలను, జయ స్తంభం (రాయితో తయారు చేసిన స్తంభం)ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైతే భగవన్నామస్మరణ చేస్తారో వారి మస్తిష్కంలో చెడు ఆలోచనలు తొలగిపోతాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ హనుమంతుడు పౌరుషం, విక్రమం, బుద్ధి ప్రసాదించాలని ఆకాంక్షించారు.సింగాపురంవాసుల భక్తి చూస్తే ఎంతో ఆనందం కలిగిందని, రాతి కట్టడంతో అద్భుతమైన దేవాలయం నిర్మించుకోవడం శుభపరిణామని తెలిపారు. భక్తులకు హనుమంతుని గొప్పతనాన్ని వివరించారు. దేవుడిని మట్టితో చేసినా, బంగారంతో చేసినా భక్తి మాత్రం మారకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంతోష్, లావణ్య పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



ఎర్త్‌సెంటర్ ఆవరణలో మొక్క నాటుతున్న జగద్గురు శంకరాచార్య తదితరులు

కద్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఉత్తరాఖండ్ రాజరాజేశ్వరి ఆశ్రమం జగద్గురు శంకరాచార్య స్వామీజీ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ఆశ్రమ పీఠాధిపతులు, స్వామీజీలు నందు సరస్వతి, ప్రకాశ్‌నంద, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



- వారంలో పరిపాలనా అనుమతులు?
- 2040 నాటి అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం

ఫలప్రదమే!

సీఎం పేషీకి కోహెడ పండ్ల మార్కెట్ డీపీఆర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఏడాది కాలంగా డీపీఆర్ దశలోనే నిలిచిపోయిన ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీకి చేరింది. గతంలో గడ్డిఅన్నారంలో ఉన్న పండ్ల మార్కెట్‌ను నగర శివార్లలోని కోహెడకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా భూమిని కూడా కేటాయించింది. గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని నిర్ణయించిన గత సర్కారు.. ఆగమేఘాల మీద మార్కెట్‌ను బాట సింగారంలోని హెచ్ఎండీఏ స్థలంలో తాత్కాలిక షెడ్లలో ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా ఇక్కడ కొనసాగుతున్న మార్కెట్ కోహెడకు తరలించాలని కమీషన్ ఏజెంట్లు, వర్తకుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఈక్రమంలో వివిధ దేశాల్లోని అత్యాధునిక మార్కెట్లను అధ్యయనం చేసిన మార్కెటింగ్‌శాఖ.. ఆ డిజైన్లకు తగ్గట్టుగా కోహెడ మార్కెట్‌ను నిర్మించాలని సంకల్పించింది. ఈ మేరకు డీపీఆర్‌ను రూపొందించింది. దీనికి వ్యవసాయశాఖ ఆమోదముద్ర కూడా వేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో మార్కెట్ ప్రతిపాదనల ఫైల్ ముందుకు కదలలేదు. దీనికి తోడు ప్రతిపాదిత స్థలాన్ని ఐటీ కంపెనీలకు ఇవ్వాలనే ప్రతిపాదన సైతం తెరమీదకు వచ్చింది. ఇటీవల మార్కెట్‌కు కొత్త పాలకవర్గం కొలువుదీరడంతో కోహెడలోనే మార్కెట్‌ను నిర్మించాలనే నిర్ణయానికి వచ్చింది. దానికి తగ్గట్టుగా డీపీఆర్‌కు ఆమోదముద్ర పడినందున పరిపాలనా అనుమతులు కోరుతూ సీఎంఓకు ఫైల్‌ను పంపింది. దస్త్రానికి ఆమోదం పడగానే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని పాలకవర్గం భావిస్తోంది.

కమీషన్ ఏజెంట్ల కోసం 681 దుకాణాలు..

గత ప్రభుత్వం 2016లో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో సర్వే నంబర్ 507/2, 548/2లో 178.09 ఎకరాల స్థలం కేటాయించింది. 2023లో కోహెడ మార్కెట్‌కు సంబంధించిన లేఅవుట్ సిద్ధం చేసింది. ఏడాది క్రితం మార్కెట్ ఫేజ్‌- 1 నిర్మాణం కోసం రూ.399.96 కోట్ల అంచనాలతో డీపీఆర్ ప్రతిపాదించారు. 2040 నాటి అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణాలు ఉండబోతున్నాయి. కమీషన్ ఏజెంట్ల కోసం 681 దుకాణాలు నిర్మించనున్నారు. కోల్డ్‌స్టోరేజీకి 19.71 ఎకరాలు, వాహన పార్కింగ్ కోసం 24 ఎకరాలు, రహదారుల కోసం మరో 40 ఎకరాలను కేటాయించనున్నారు. సిబ్బంది నివాస గృహ సముదాయం అక్కడే ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం అంచనాలకు అదనంగా మరో వంద ఎకరాల స్థలాన్ని సేకరించడానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పండ్లు, పూలు, కూరగాయలు కలిపి సమీకృత మార్కెట్ దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని తెలుస్తోంది. ఫేజ్‌–1కి సంబంధించి డీపీఆర్‌కు పరిపాలనా ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

తాత్కాలిక ఏర్పాట్లతో ఇబ్బందులు

కోహెడ పండ్ల మార్కెట్‌కు తెలంగాణతో పాటు దేశ, విదేశాల నుంచి పండ్లు వస్తాయి. నగరంతో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి పండ్లు ఎగుమతి అవుతాయి. ఇక్కడ తాత్కాలికంగా చేసిన ఏర్పాట్లతో మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు, వ్యాపారులు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. శాశ్వత మార్కెట్ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



రూ.5 వేల కోట్ల టర్నోవర్‌కు చేరువలో..

కోహెడ మార్కెట్ కోసం రైతులు, వ్యాపారులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ప్రపంచ గుర్తింపు పొందిన మార్కెట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పండ్ల మార్కెట్ ప్రస్తుతం ఏడాదికి రూ.1,550 కోట్ల టర్నోవర్ అవుతోంది. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఏడాదికి రూ.5 వేల కోట్ల టర్నోవర్ చేరుకుంటుందని అంచనా వేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రైతులు, ఏజెంట్లకు అపారమైన నమ్మకం ఉంది. నూతన మార్కెట్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభవుతాయి.

– చిలుక మధుసూదన్ రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, జడ్జిలు, న్యాయవాదులు

ప్రజలకు సత్వర న్యాయమే లక్ష్యం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే
- ఇబ్రహీంపట్నంలో 15వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, షాద్‌నగర్‌లో 16వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు వర్చువల్ పద్ధతిలో ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకే కొత్త న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 15వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానాన్ని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు శ్యామ్ కోశి, వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయసేన్‌రెడ్డితో కలిసి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ప్రజలకు చేరువగా ఉంటే .. కేసులు త్వరితగతిన పరిష్కారమై కక్షిదారులకు స్వతర న్యాయం లభిస్తుందన్నారు. సాధ్యమైనంత త్వరగా కేసులను పరిష్కరించాలని ఆయన సూచించారు. కొత్త కోర్టులకు రెగ్యులర్ జడ్జిలను త్వరలో నియమిస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశానుసారం కొత్త న్యాయస్థానాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఇబ్రహీంపట్నంతోపాటు షాద్‌నగర్‌లో అదనపు జిల్లా కోర్టును ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న 1,860 కేసులను కొత్తగా ఏర్పాటు చేసిన ఇబ్రహీంపట్నం 15వ అదనపు న్యాయస్థానానికి బదిలీ అవుతాయని తెలిపారు.

ప్రత్యక్ష ప్రారంభోత్సవంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి

ఇబ్రహీంపట్నంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన 15వ అదనపు న్యాయస్థానం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ప్రత్యక్షంగా ఆవిష్కరించారు. నూతన 15వ అదనపు కోర్టు న్యాయమూర్తి జయప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుతో వివిధ కేసుల వాదోపవాదాలు త్వరితగతిన పూర్తవుతాయని తద్వార సత్వర న్యాయం దొరుకుతుందన్నారు. కొత్త కోర్టుకు సంబంధించి న్యాయమూర్తి జయప్రసాద్ రెండు కేసులను కాల్ వర్క్ చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీనియర్ న్యాయమూర్తి శ్రీమతి శంకర్ శ్రీదేవి, అదనపు సీనియర్ న్యాయమూర్తి రీటాలాల్ చందు, ప్రధాన జూనియర్ న్యాయమూర్తి యశ్వంత్‌సింగ్, అదనపు జూనియర్ న్యాయమూర్తి హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్, సీనియర్ న్యాయమూర్తులు సత్యవీర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ఎండీ గులాం హైదర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

షాద్‌నగర్‌రూరల్: నూతన కోర్టుల ఏర్పాటుతో కోర్టు పరిధిలో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టును శుక్రవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గం అని అన్నారు. కేసులను త్వరతగతిన పరిష్కరించుకునేందుకు ఇరువర్గాలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. నూతన కోర్టుల ఏర్పాటు న్యాయవాదులు, కక్షిదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి రత్న పద్మావతి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అంజనేయులు, స్థానిక న్యాయమూర్తులు రాజ్యలక్ష్మి, ధీరజ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు శ్వేత, జగన్మోహన్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అబ్దుల్‌కరీం, గంగాధర్, రాజగోపాల్, నారాయణరెడ్డి, శివరాములుగౌడ్, సబియా సుల్తానా, రజాక్‌హుస్సేన్ రాజశేఖర్‌రాజు, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్రసర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గృహజాబితా నమోదు ప్రక్రియను, నమోదు ప్రక్రియలో భాగంగా ఇళ్లకు అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. నమోదు ప్రక్రియలో తప్పులు దొర్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. నిర్లక్ష్యాన్ని, పొరపాట్లను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట డివిజన్ ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ పార్థసారధి, ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్, ఏపీఎం నగేష్, పంచాయతీ కార్యదర్శి, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆర్డీఓ సరితతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు, డయాలసిస్ సెంటర్, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ వార్డు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. బాధితులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ సమస్య, పారిశుద్ధ్య నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డివిజన్ ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ పార్థసారధి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కద్తాల్: ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఎల్ఎం బృందం సభ్యులు డాక్టర్ సౌందరా పాండ్యన్, డాక్టర్ భక్తవత్సల పెరుమాళ్ అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి, కర్కల్‌పహాడ్, గానుగుమార్లతండాల్లో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణా ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు, వివిధ రకాల పింఛన్ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకుని, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులతో సమావేశమై గ్రామాల అభివృద్ధి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు కరుణశ్రీ, స్వేత, ఎంపీడీవో సుజాత, ఈజీఎస్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఎల్ఎం బృందం సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

గిరిజన సంక్షేమ గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్



విద్యార్థినులతో మాట్లాడుతున్న శరత్

షాద్‌నగర్‌రూరల్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గిరిజన సంక్షేమ గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాలలోని డైనింగ్ హాల్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, స్టోర్ రూంలోని వంట సామగ్రి, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. డైనింగ్ హాలులో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగానే కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని అన్నారు. డిగ్రీ విద్యార్థులను మొదటి సంవత్సరం నుంచే పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మేధస్సును పెంపొందించుకొని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా, వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఆమనగల్లు: ప్రభుత్వం గత ఏడాది జూలై నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా న్యాయం చేయాలని కోరారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సదానందంగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తంచే శారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్టీయూ పోరాడుతోందని తెలిపారు. తమ పోరాటాల ఫలితంగానే ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తుచేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చూడాలని, 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ అందిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. సమస్యల పరిష్కారానికి చేసే పోరాటానికి ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, రవి, రామసుబ్బారావ్, భూపాల్, కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పరమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

పింఛన్లు పెంచే దాకా పోరాటం

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం: ఆసరా పింఛన్లు పెంచే వరకు పోరాడుతూనే ఉందామని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం వీహెచ్‌పీఎస్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీని మరిచిపోయిందన్నారు. ప్రతీ నెల 1న పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పింఛన్ల పెంపుపై తాడోపేడో తేల్చుకుంటామని ఇటీవల తేల్చి చెప్పారని గుర్తు చేశారు. అందులో భాగంగా ఈనెల 16వ తేదీ వరకు జిల్లా సదస్సులు, 17 నుంచి 23 వరకు కలెక్టరేట్ల వద్ద రిలే దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 26న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొరెడ్డి అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. పింఛన్‌దారులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఉద్యమాలకు మద్దతుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండ్రు ప్రవీణ్, జి.సతీష్, జంగయ్య, యాదయ్య, బాలరాజ్, సంజీవ, బానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

తలకొండపల్లి: ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన కల్లు రాజేందర్‌రెడ్డి, ఆయన చిన్నాన్న రామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 6న ఇళ్లకు తాళాలు వేసి తిరుపతి వెళ్లారు. ఇంటి ఎదుట గ్లామర్ బైక్‌ను పార్క్ చేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం కమటం అంజమ్మ వారి ఇళ్లను శుభ్రం చేసేందుకు వెళ్లింది. దీంతో ఆమె తాళాలు పగులగొట్టినట్లు గుర్తించి ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న వారు వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ దొంగతనం జరుగలేదు. సమాచారం అందుకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇళ్లను పరిశీలించారు. కల్లు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఫార్మాసిటీపై పునరాలోచన చేయాలి

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

యాచారం: కాంగ్రెస్ పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీ రద్దుపై మాటమారుస్తున్నారని, పైగా పట్టా భూములు ఇవ్వాలని అధికారుల చేత రైతులను భయాందోళనలకు గురి చేస్తున్నారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సమన్వయకర్తలు కవులు సరస్వతి, కుందారపు నారాయణ ఆధ్వర్యంలో కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు అధికారంలోకి రాకముందు ఫార్మాసిటీకి వ్యతిరేకంగా మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, పట్టా భూములు తీసుకోబోమని హామీలు ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని, పట్టా భూముల సేకరణ కోసం రైతులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారని విమర్శించారు. పట్టా భూముల సేకరణ నిలిపేసి టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను తిరిగి రైతుల పేర్ల మీద నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోనే ఫ్యూచర్‌సిటీ, నెట్ జీరో సిటీ, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామనడం సరైంది కాదన్నారు. ఫార్మాసిటీ రద్దుపై పునరాలోచన చేయకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ఫార్మాసిటీకి వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు కానమోని గణేశ్, ముత్యాల మహిపాల్‌రెడ్డి, సామ నిరంజన్, బందె రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

రింగ్ రైల్ నిర్మాణానికి ఏరియల్ సర్వే

కొందుర్గు: రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ నిర్మాణానికి ఏరియల్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్బీ అసోషియేషన్ ఏజెన్సీ ప్రతినిధులు శుక్రవారం సర్వే ప్రారంభించారు. రెండు నెలల క్రితం కొందుర్గు మండలంలోని రేగడిచిలకమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్, కొందుర్గు, తంగెళ్లపల్లి మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్ చేసిన చిహ్నాల ఆధారంగా రింగ్‌రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ ఏర్పాటుకు సర్వే పనులు చేపట్టారు. మరో రెండు రోజుల్లో హెలీకాప్టర్‌తో ఈ గ్రామాల్లో సర్వే పనులు పూర్తిచేయనున్నట్లు సమాచారం.


సర్వేకు సిద్ధం చేసిన మిషన్

కార్తీక మాసంలో ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ్

చేవెళ్ల: కార్తీక మాసంలో పంచారామాలు దర్శించుకునేందుకు భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీని అందిస్తుందని వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఈ ప్రత్యేక ప్యాకేజీ అందిస్తుందని.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్తీక సోమవారం రోజున పరమ శివుడి దర్శనం చేసుకునే భక్తుల కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించిందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ హైదరాబాద్–2 డిపో నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. నవంబర్‌లో వచ్చే ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటలకు బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. దర్శనాంతరం బస్సు మంగళవారం ఉదయం 10గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయన్నారు. ఈ టూర్ ప్యాకేజీలో అమరావతి(అమరేశ్వరాలయం), భీమవరం (సోమేశ్వరాలయం), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరాలయం), సామర్లకోట (కుమారరామ భీమేశ్వరాలయం) దర్శించునే అవకాశం ఉంటుందని చెప్పారు. వినియోగించుకోవాలనుకునే వారు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తమ దగ్గరలోని బస్ స్టాండ్‌లతో పాటు సమీప టీజీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ల బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఫోన్ నెంబర్లు హైదరాబాద్–2 డిపో 9959226249, 7382838010, వికారాబాద్ డిపో 9959226252, 7382839610 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అజ్ఞాతంలోకి మున్సిపల్ వైస్ చైర్మన్

పదవికి రాజీనామా చేసిన నటరాజ్

షాద్‌నగర్: మున్సిపల్ వైస్ చైర్మన్, 16వ వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎం.ఎస్.నటరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమినర్ వెంకన్నకు అందజేశారు. అనంతరం ఎంఎస్.నటరాజ్ మాట్లాడుతూ.. మానవసేవయే మాధవ సేవగా భావించి 1988 నుంచి రాజకీయంలో ఉన్నానని.. పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీ(16వ వార్డు) ప్రజలు మొదటి సారిగా కౌన్సిలర్‌గా గెలిపించారని.. అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. నన్ను ఆదరించి గెలిపించిన వార్డు ప్రజలకు, వైస్ చైర్మన్ చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నా వ్యక్తిగత కారణాల వలన కౌన్సిలర్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా ప్రతులను సీడీఎంఏ హైదరాబాద్, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. బాధ్యత కలిగిన బీఆర్ఎస్ కార్యకర్తగా పార్టీలోనే కొనసాగుతానని చెప్పారు. నటరాజ్ రాజీనామాను ఉపసంహరింపజేసేందుకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రయత్నాలు చేశారు. ఎంఎస్.నటరాజ్ అజ్ఞాతవాసంలోకి వెళ్లడంతో అంజయ్యయాదవ్ ప్రయత్నాలు ఫలించలేదని తెలుస్తోంది.



రాజీనామా పత్రాన్ని కమిషనర్ వెంకన్నకు అందజేస్తున్న ఎంఎస్.నటరాజ్

చికిత్స పొందుతున్న మత్స్యకారుడి మృతి

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాలు.. కందుకూరుకు చెందిన ఎడ్ల ఉమాకాంత్‌ముదిరాజ్ (25) మత్స్యకారుడు. ఈ నెల 3న చేపలు పట్టే వలలు కొనుగోలు చేయడానికి సికింద్రాబాద్ మార్కెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బోయిన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కుటుంబీలకు వెంటనే 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లి ఓవైసీ ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు.


ఉమాకాంత్ ముదిరాజ్(ఫైల్)

మంత్రి శ్రీధర్‌బాబు నివాసంలో సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉంటున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నివాసంలో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో క్వార్టర్ నెంబర్–7లో మంత్రి శ్రీధర్‌బాబు ఉంటున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి ఇంట్లో ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీపీ సతీష్‌కుమార్ లక్ష్మీపూజ నిర్వహించాడు. పూజ అనంతరం రాత్రి 9.30 గంటలకు ఆయన ఫోన్ కోసం చూడగా కనిపించలేదు. అన్ని ప్రాంతాలు వెతికినా ఉపయోగం లేకుండా పోయింది. మంత్రి ఇంట్లో పూజలకు ఎంతోమంది అతిథులు వచ్చారని, ఎలా చోరీకి గురైందో తెలియదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పూజల్లో నిమగ్నమై ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీ చేసి ఉంటారని పేర్కొన్నారు. దీపావళి తర్వాత వారం రోజులుగా తాను విధి నిర్వహణలో బీజీగా ఉన్నానని, దీంతో శనివారం ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత


క్రీడాకారులతో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

మధుయాష్కీ గౌడ్

హుడాకాంప్లెక్స్: క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి మధుయాష్కి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి మాట్లాడుతూ అవసరమైన వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని క్రీడాకారులతో కలిసి మధుయాష్కి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు, క్రికెట్ కోచ్ రాజశేఖర్, నాయకులు మకుటం సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్, బద్దుల వేణుగోపాల్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, కుట్ల నరసింహ యాదవ్, కందికంటి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ఊపిరి పోశాడు!

యువకుడి ప్రాణాన్ని కాపాడిన హోంగార్డు

లంగర్‌హౌస్: గుండెపోటు వచ్చి రోడ్డుపై పడిపోయిన ఓ యువకుడికి ట్రాఫిక్ హోంగార్డు సీపీఆర్ చేసి బతికించిన ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నానల్‌నగర్ చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. సాలార్జంగ్ కాలనీలో నివసిస్తున్న మొహమ్మద్ ఖలీలుద్దీన్(36) వృత్తిరీత్యా క్యాబ్ డ్రైవర్. గురువారం సాయంత్రం విధుల్లో భాగంగా గచ్చిబౌలికి వెళ్లడానికి నానల్‌నగర్ బస్టాప్‌లో వేచి చూస్తున్నాడు. ఆ సమయంలోనే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అతడు కింద పడిపోయాడు. అక్కడ ఉన్నవారు బాధితుడి వద్దకు వెళ్లడానికి సాహసించలేదు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు సుబ్బారెడ్డి వెంటనే స్పందించాడు. గుండెపోటుతో కింద పడిపోయిన ఖలీలుద్దీన్‌కు సీపీఆర్ చేసి బతికించాడు. అనంతరం దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించాడు. ప్రస్తుతం ఖలీలుద్దీన్ కోలుకున్నాడు. సీపీఆర్‌తో యువకుడి ప్రాణాన్ని కాపాడిన సుబ్బారావును ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ అంజయ్య అభినందించారు.


ఖలీలుద్దీన్‌కు సీపీఆర్ చేస్తున్న హోంగార్డు

ఆదర్శంగా రేవంత్‌రెడ్డి పాలన

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవితం తెలంగాణ ఉద్యమకారులకు, నూతన రాజకీయ అధ్యయనానికి ఆదర్శనీయమని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్‌లోని అంధ బాలికల వసతిగృహంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలకు వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్, వైఎస్సార్ తరువాత ఆ స్థాయిలో ప్రజారంజక పాలనతో సామాజిక విప్లవాత్మకమైన అభివృద్ధితో రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమన్నారు. తన పుట్టినరోజున మూసీ వెంట పాదయాత్ర చేయడం చరిత్రలో సువర్ణ అధ్యాయమని అన్నారు. దశాబ్ధాలుగా నల్లగొండ జిల్లా ప్రజలు మూసీ కలుషిత నీటితో ఆరోగ్యాలు క్షీణించి అనారోగ్యాలతో, కలుషిత పంటలతో ఇబ్బందులు పడుతున్నారని వారి గోస తీర్చేందుకు కంకణం కట్టిన రేవంత్‌రెడ్డికి నల్లగొండ బిడ్డగా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. కోర్టు ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్, నిరుద్యోగ దివ్యాంగ యువత కోసం జాబ్ పోర్టల్‌ని ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. సమగ్ర కుల గణనలో 13వ కాలంగా దివ్యాంగుల అంశం చేర్చడం తద్వారా 21 రకాల వికలాంగుల సంఖ్యని చేయడం గర్వకారణమన్నారు. అనంతరం వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, బ్లైండ్ హాస్టల్ విద్యార్థులతో కలిసి వీరయ్య కేక్ కట్ చేశారు.


అంధ బాలికల వసతిగృహంలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ తినిపిస్తున్న దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య